క్లుప్తంగా

హెల్మెట్ ధారణ తప్పనిసరి



ఆగిరిపల్లి: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద వాహనాలను తనిఖీ చేసి ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం వలన ప్రమాద తీవ్రత తగ్గి ప్రాణాలు నిలబడతాయని, తప్పనిసరిగా ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గణిత ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ



ఇబ్రహీంపట్నం: మూలపాడు జెడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కొచ్చెర్ల మోహనరావుకు పీహెచ్‌డీ లభించింది. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు ఆదివారం ఆయనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.మేరీ సునంద పర్యవేక్షణలో ఎన్టీఆర్ జిల్లాలో 9, 10 తరగతుల విద్యార్థుల గణిత శాస్త్ర అభ్యసన సామర్థ్యాలు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకు గాను పీహెచ్‌డీ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రావును పలువురు అభినందించారు.

1,050 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లో ఆదివారం మధుమేహ రోగులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్టీఆర్, ఖమ్మం జిల్లాల నుంచి 1,050 మంది ఈ వైద్య శిబిరానికి విచ్చేశారు. వైద్యులు వల్లభనేని రవీంద్ర, తాళ్లూరి రామకోటేశ్వరరావు, సత్యతేజ, లక్ష్మణరావులు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. రక్తపోటు, మధుమేహం నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలను, పాటించాల్సిన ఆహార నియమాలపై పలు సూచనలు చేశారు. ఒక పూట తృణ ధాన్యాలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజూ నడక, వ్యాయామం తప్పక చేయాలన్నారు. జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు పాపారావు, హరికృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటాచల స్వామి తిరు కల్యాణ వేడుకలు



తిరువూరు: స్థానిక వేంకటా చలస్వామి ఆలయంలో తిరు కల్యాణ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ నెల 5 నుంచి 9 వరకు అధ్యయనోత్సవాలు, అనంతరం స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా జరిపారు. శనివారం రాత్రి తీర్థగోష్టి, చూర్ణోత్సవం, చక్రవరి, పూర్ణాహుతి అనంతరం ధ్వజపట అవరోహణం చేశారు. ఆదివారం ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించి స్వామి వారిని అద్దాల మండపంలో పవళింపు సేవ జరిపారు. ఆలయ అర్చకులు దేవయజనం వేణుగోపాల కృష్ణమాచార్యులు, దివి ఉదయ కుమారాచార్యులు కల్యాణోత్సవాలను నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడ పశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ కమర్షియల్ కాంప్లెక్స్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా సోమవారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు (విజయవాడ టౌన్) జి. రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మా గాంధీ హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్, మహేంద్ర నగర్, అంబేడ్కర్ నగర్, టెలికాం కాలనీ, వ్యవసాయ మార్కెట్, బైపాస్ రోడ్డు, బాలాజీ టవర్స్ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

21న ధ్వజస్తంభ ప్రతిష్ట

చందర్లపాడు(నందిగామ రూరల్): మండలంలోని తోటరావులపాడులోని మౌలాలి నాగుల్ మీరాస్వామి వారి దర్గాలో ఈనెల 21న ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు పెరిగిశెట్టి నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ప్రతిష్టా మహోత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

దశాబ్దాలుగా అద్దె భవనాల్లోనే!

- సొంత భవనాలు లేని ప్రభుత్వ కార్యాలయాలు
- అసౌకర్యాల నడుమ కొనసాగుతున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు



అద్దె భవనంలో నడుస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నూజివీడు: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడులో పలు ప్రభుత్వ కార్యాలయాలు దశాబ్దాల తరబడి అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అసౌకర్యాల నడుమ ఉద్యోగులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అద్దెల రూపంలో ఏటా లక్షలాది రూపాయల ప్రజాధనం భవన యజమానులకు చెల్లిస్తున్నప్పటికీ ప్రజలకు మాత్రం సౌకర్యవంతంగా ఉండటం లేదు. దశాబ్దాల కాలంగా అద్దెలకు చెల్లించిన సొమ్ముతో పలు కార్యాలయాలకు సొంత భవనాలు సమకూరేవని పలువురు అంటున్నారు. అయినప్పటికీ సంబంధిత కార్యాలయాల ఉన్నతాధికారులు ఇప్పటికీ సొంత భవనాల ఏర్పాటుపై ఆలోచించడం లేదు. అద్దె భవనాలు కావడంతో చాలీచాలని ఇరుకు గదుల్లో ఉద్యోగులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మెజారిటీ కార్యాలయాలన్నీ అద్దె భవానాల్లోనే

నూజివీడులోని డివిజన్ స్థాయి కార్యాలయాల్లో మెజారిటీ కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ సీఐ, బోద, మలేరియా, మత్స్య శాఖ, హౌసింగ్ ఈఈ, వెనుకబడిన తరగతుల డివిజినల్ అధికారి, కార్మిక శాఖ, సబ్ రిజిస్ట్రార్, డీఎస్పీ తదితర కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వీటిల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఇరుకుగా ఉండటంతో రిజిస్ట్రేషన్ల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యాలయాలకు వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలను రోడ్ల పైనే వదిలి రావాల్సిన దుస్థితి నెలకొంది. కొందరైతే తమ వాహనాలను సమీపంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో ఉంచి వస్తున్నారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలైతే ఎక్కడ ఉన్నాయో కూడా ప్రజలకు తెలియని పరిస్థితి ఉంది. డీఎల్‌పీఓ కార్యాలయం ఇటీవల వరకు రైతు బజారు రోడ్డులో ఉండగా ఇప్పుడు దానిని వేరే చోటుకు మార్చారు. తూనికలు కొలతల శాఖ కార్యాలయం గతంలో సిబ్బంది పేటలో ఉండేది, ఆ తరువాత దానిని ఎక్కడకు మార్చారో ఎవరికీ తెలియదు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కార్యాలయాలకు సొంత భవన సదుపాయాన్ని కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి. ఆదాయం వచ్చే శాఖలకు చెందిన కార్యాలయాలు కూడా అద్దె భవనంలోనే కునారిల్లుతున్నాయి. పాలకులు, అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవన వసతిని కల్పించాలనే విషయంపై దృష్టి సారించాలి.

– జి. రాజు,
సీపీఎం జిల్లా నాయకుడు, నూజివీడు

పాలకులు స్పందించాలి



అధిక ఆదాయం సమకూరే సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయాలు కూడా ప్రైవేటు భవనాల్లోనే దశాబ్దాల తరబడి కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలకు కృషి చేసి ప్రజాధనం వృథా కాకుండా చూడాలి.

– కంచర్ల లవకుమార్,
మాజీ కౌన్సిలర్, నూజివీడు

తాత్కాలికంగా పీజీఆర్ఎస్ రద్దు

మునునూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ చెప్పారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తాత్కాలికంగా రద్దయిందని చెప్పారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పట్టణ ఎస్ఐ జ్యోతిబసు



నూజివీడు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్ఐ జ్యోతిబసు పేర్కొన్నారు. పట్టణంలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అల్లర్లలోనూ, గొడవల్లోనూ తలదూర్చవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులకు పాల్పడవద్దన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందని చెప్పారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవహార శైలి మార్చుకుని గొడవలకు, అల్లర్లకు దూరంగా ఉండాలన్నారు. సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్‌ను తొలగించేందుకు సిఫార్సు చేస్తామన్నారు.

కుక్కలు, కోతుల స్వైర విహారం


భయాందోళనలో కాలనీ వాసులు



మైలవరం బస్టాండ్ రోడ్డులో సంచరిస్తున్న కుక్కలు

మైలవరం: మైలవరంలో వీధి కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. మైలవరం రామకృష్ణ కాలనీ, ఆర్టీసీ బస్‌స్టాండ్ పక్క వీధిలోను, మరి కొన్ని ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ వాహన చోదకులను, పాదచారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా వాహనాలకు అడ్డు పడుతుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కోతులు ఇళ్ల గోడలపై తిరుగుతూ మహిళలను, పిల్లలను భయపెడుతున్నాయి. రామకృష్ణ కాలనీలో విద్యాలయాలు ఉండటంతో ఉదయం, సాయంత్రం స్కూల్ పిల్లలు వస్తూపోతూ ఉంటారు. కోతుల భయంతో వారు ఆందోళనకు గురవుతున్నారు. పిల్లల చేతుల్లో ఉన్న తినుబండారాలను లాక్కుని పోతున్నాయి. పంచాయతీ వారు స్పందించి వీధి కుక్కలు, కోతుల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గతంలో పట్టేవారు



గతంలో రామకృష్ణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో బోన్‌లు ఏర్పాటు చేసి కోతులను పట్టుకుని పొందుగల సమీపం పంగిడి ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేవారు. దీనితో కొంతవరకు కోతుల సమస్య పరిష్కారమయ్యేది. ఇప్పుడు మళ్లీ కోతులు మందలు మందలుగా తిరుతూ స్థానికులను ఇబ్బందులు పెడుతున్నాయి. అప్రమత్తంగా లేకుంటే ఇళ్లల్లోకి ప్రవేశించి ఆహార పదార్థాలు తీసుకుపోతున్నాయి. పంచాయతీ వారు కోతులు, కుక్కలను పట్టించి పంగిడి అటవీ ప్రాంతంలో వదిలితే కొంత ఉపశమనంగా ఉంటుంది.

– టి. ఏసు, రామకృష్ణ కాలనీ, మైలవరం

ఒకటిన ఆప్మెల్ ఎంప్లాయీస్ సొసైటీ సమావేశం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏపీహెచ్ఎంఈఎల్ (ఆప్మెల్) ఎంప్లాయీస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ–జీ2837 సర్వసభ్య సమావేశం కొండపల్లి ఏపీహెచ్ఎంఈఎల్ కార్యాలయంలో మార్చి ఒకటిన నిర్వహిస్తామని అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎన్.వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా ఉన్న కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. హాజరయ్యే సభ్యులు సొసైటీ జారీ చేసిన జనరల్ నంబర్, ఐడీ కార్డు, సంఘం ధ్రువీకరించిన ఏదైనా ఒక ఆధారంతో మహా జన సభకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు సెల్: 94909 58343 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు కవితల పోటీలు

తిరువూరు: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషలో కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు తిరువూరు రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉయ్యూరు అనసూయ, రేపాక రఘునందన్ తెలిపారు. తిరువూరులోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివే విద్యార్థినీ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సామాజిక ఇతివృత్తంపై కవితలను రచించి కళాశాల ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రం జతచేసి తిరువూరు శాఖా గ్రంథాలయంలో లేదా స్వాతి టైప్ ఇనిస్టిట్యూట్‌లో స్వయంగా అందజేయవచ్చన్నారు. వాట్సాప్ 95505 06829, 94408 48924 నంబర్లకు తమ కవితలను ఈ నెల 20వ తేదీ లోగా వాట్సాప్ ద్వారా పంపవచ్చన్నారు.

నేడు విద్యుత్ లైన్ ఆధునికీకరణ పనులు

నూజివీడు: ఏపీ ట్రాన్స్‌కోకు చెందిన నూజివీడు–కామవరపుకోట విద్యుత్ లైన్ ఆధునికీకరణలో భాగంగా ఈ నెల 17న ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆధునికీకరణ పనులు నిర్వహిస్తామని ఈఈ ఓఅండ్ఎం డివిజన్ ఎస్.కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. కామవరపుకోటలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఏమైనా ఐచ్చిక పరిస్థితి ఎదురైతే నూజివీడు పరిసర ప్రాంతాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు.

సీఎస్ఐ చర్చిలో ఘనంగా కోత పండుగ

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని సెయింట్ థామస్ సీఎస్ఐ టౌన్ చర్చిలో ఆదివారం కోత పండుగను(కృతజ్ఞతార్పణల పండుగ) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో చర్చి డీనరీ చైర్మన్ ఎస్.పాల్‌రాజు ప్రసంగించారు. దేవునికి సమర్పించిన వస్తువులు, పండ్లను వేలం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణా, గోదావరి డయోసిస్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాకలపాటి కనకరాజు, ఎంఏపీ జోసఫ్, చర్చి ప్యారిష్ కమిటీ సెక్రటరీ జడ్‌జీ.సుందరరావు, ట్రెజరర్ ఎం. దేవరాజు, సభ్యులు కె.ప్రభాకర్ ప్రభూజీ, జె.కుమార్‌బాబు, స్త్రీల మైత్రి ప్రెసిడెంట్ ఆశాపాల్, సెక్రటరీ పి.ఉషా హరిణి, ఇతర కమిటీ సభ్యులు, యూత్ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మటన్‌కు పెరిగిన డిమాండ్



జి.కొండూరులో మటన్ దుకాణం

జి.కొండూరు: బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ విక్రయాలు తగ్గాయి. మటన్‌కు డిమాండ్ పెరిగింది. చికెన్ కొనేందుకు ప్రజలు వెనుకాడటంతో చికెన్ దుకాణాలు వెలవెలబోయాయి. మాంసం ప్రియులంతా ఆదివారం కావడంతో చికెన్‌కు ప్రత్యామ్నాయంగా మటన్‌ను ఎంచుకున్నారు. ఈ క్రమంలో మటన్ దుకాణాలు కిక్కిరిసిపోయాయి. ఈ ఆదివారం జి.కొండూరులో కిలో చికెన్‌ను రూ.160 నుంచి రూ.180 వరకు విక్రయించగా మటన్ కిలో రూ. వెయ్యికి విక్రయించారు. తక్కువ ధరకు నాణ్యమైన మటన్‌ను విక్రయించే పేరున్న జి.కొండూరులో డిమాండ్ పెరగడంతో రూ. వెయ్యి వరకు విక్రయించారు. చేపలు, రొయ్యలకు కూడా డిమాండ్ పెరిగింది. ఇదే తీరు కొనసాగితే చికెన్ వ్యాపారులు, పౌల్ట్రీ ఫాం యజమానులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

వెలవెలబోతున్న చికెన్ సెంటర్లు..



చనుబందలో వెలవెలబోతున్న చికెన్ సెంటర్

చాట్రాయి: బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకడంతో మండలంలోని చికెన్ సెంటర్లు వెల వెల బోతున్నాయి. ఆదివారం వస్తే చికెన్ సెంటర్లు కోడి మాంసం ప్రియులతో కిటకిటలాడేవి. దీంతో కోళ్లకు సోకిన వ్యాధితో మాంసం ప్రియులు కోడి మాంసాన్ని తినడానికి భయపడటంతో బేరాలు లేక వ్యాపారులు ఖాళీగా ఉంటున్నారు.

ఫ్లెక్సీలకు ముసుగు





కుంటముక్కల క్రాస్ రోడ్డు వద్ద రహదారికి ఇరువైపులా ఉన్న టీడీపీ ఫ్లెక్సీలకు తొడిగిన ముసుగు

సాక్షి ఎఫెక్ట్

జి.కొండూరు: జి.కొండూరు మండల పరిధి కుంటముక్కల క్రాస్ రోడ్డు వద్ద 30వ నంబరు జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీలకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌లో భాగంగా అధికారులు ట్రాన్స్‌పరెంట్ కవర్ తొడిగి వదిలేశారు. దీని వల్ల ఫ్లెక్సీలో ఉన్న పేర్లు, ఫొటోలు బయటకు కనిపిస్తున్నాయి. దీనిపై ఈ నెల 14వ తేదీన 'సాక్షి' ప్రచురించిన 'కవరింగ్‌లో మీకు సాటిలేరు' కథనానికి అధికారులు స్పందించారు. రహదారికి ఇరువైపులా ఉన్న ఫ్లెక్సీలకు గ్రీన్ మ్యాట్‌తో ముసుగు తొడిగారు. ఫ్లెక్సీపై ఉన్న జెండాలను తొలగించారు.

కాలువ నిర్మాణ పనులు పూర్తి చేస్తాం

మంత్రి పార్థసారథి



సాగర్ కెనాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారథి, ఎంపీ మహేష్ యాదవ్

ముసునూరు: నాగార్జున సాగర్ కెనాల్ వేంపాడు మేజర్ కాలువ నిర్మాణ పనులు, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని త్వరలో పూర్తి చేస్తామని సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు, వేల్పుచర్ల గ్రామాల్లో ఆదివారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గం ప్రాంతంలోని కాట్రేనిపాడు, మడిచర్ల సాగు భూములకు నీరందించే వేంపాడు మేజర్ కాలువను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనులకు రెండు ప్రదేశాల్లో 350 మీటర్ల పొడవున ఏర్పడిన ఆటంకాలను తొలగించి, కాలువ తవ్వించి, త్వరలోనే దిగువ గ్రామాల భూములకు నీరందిస్తామని చెప్పారు. దీనిపై తక్షణ నివేదిక అందించాలని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను ఆదేశించారు. నూజివీడు నియోజకవర్గానికి అత్యవసరమైన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూడా త్వరలో పూర్తి చేస్తామని చెప్పారు. అంతకు ముందు వేల్పుచర్లలో అంకమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాట్రేనిపాడు యాదవ సామాజికవర్గ ప్రజల కోసం రూ.20 లక్షల ప్రభుత్వ నిధులతో సామాజిక భవనం నిర్మిస్తామని, స్థానిక పెద్ద చెరువులో పూడికతీత పనులు త్వరలో చేయిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఇరిగేషన్ ఈఈ ఆర్.సంతోష్, డీఈ వెంకటేశ్వరరావు, ఏఈ సతీష్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాపర్ల బాలకృష్ణ, సర్పంచ్ గద్దల సుహాసిని, ఎంపీటీసీ నాగమంజుల, మాజీ సర్పంచ్ శ్యామలరావు, అధికారులు పాల్గొన్నారు.

కొండపల్లి రోడ్డు విస్తరణపై అఖిలపక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మెయిన్ రోడ్డు విస్తరణపై స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి అఖిలపక్ష సమావేశం జరిగింది. వైఎస్సార్ సీపీతోపాటు పలువురు కూటమి నేతలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి ఉన్న కొండపల్లి రోడ్డు విస్తరణకు నోచుకోవడం లేదన్నారు. పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో రోడ్డు విస్తరణ చేయడం తప్పనిసరని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు పెద్ద సమస్యగా మారిందని, భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ఇళ్ల యజమానులు, దుకాణదారులు సహకరించాలని కోరారు. ఆక్రమణల తొలగింపునకు పెద్ద మనసుతో ముందుకు వస్తే ప్రభుత్వం ద్వారా నిధుల కేటాయింపునకు కృషి చేద్దామని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య, మాజీ ఎంపీపీ చెరుకు మాధవరావు, కూటమి నాయకులు అక్కల గాంధీ, బొర్రా కిరణ్, బి. శ్రీకాంత్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం వ్యాయామశాల సమీపంలోని శ్రీగణపతి మందిరంలో ఆదివారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. స్వామివారికి విశేషంగా అన్నాభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మర్లపాలెం పూర్వపు విద్యార్థులు

చాట్రాయి: ఆడుతూ పాడుతూ చదువుకుని 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థుల సంతోషం అంతా ఇంతా కాదు. మండలంలోని మర్లపాలెం హైస్కూల్ 1995–2000 సంవత్సరపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగింది. ఎంతో కాలం తర్వాత కలుసుకున్న మిత్రులు ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకుని నాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో కిక్కిరిసిన భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సెలవుదినం కావడంతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచే భక్తులు పాలు, పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు మధ్యాహ్న సమయంలో మునేరు అవతల మామిడి తోటల్లో సేద తీరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



మైలవరం: తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలం గోపాలపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఏలూరు జిల్లా వేగువాడ గొల్లగూడెంకు చెందిన గురజాల వెంకన్న బాబుగా బాధితుడిని గుర్తించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌సీసీ సీ సర్టిఫికెట్ రాత పరీక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): కాకినాడ గ్రూప్ పరిధిలో ఎన్‌సీసీ యూనిట్లకు ఆదివారం విజయవాడలోని నలంద విద్యానికేతన్, పీబీ సిద్దార్థ కళాశాల, ఆంధ్రా లయోల కళాశాలలో రాత పరీక్ష నిర్వహించారు. కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్ నేతృత్వంలో పరీక్షలు జరిగాయి. శనివారం సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు, ఆదివారం రాత పరీక్షను నిర్వహించారు. ఎన్‌సీసీలో మూడేళ్ల పాటు శ్రమించి నేర్చుకున్న పలు అంశాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షకు క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని పరీక్ష రాశారు.

